# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 342 | పేజీలు: 4 | వెల: 4/- | గురువారం ● 27, జూన్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## ఢిల్లీలో తెలంగాణ ప్రతినిధిగా జితేందర్ రెడ్డి

**బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎంపి**

**న్యూఢిల్లీ,జూన్26(నమస్తే ఉదయం):** ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా జితేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి వారధిగా ఉంటానన్నారు. విభజన చట్టంలో మిగతా.. 2లో

# దక్షిణ ఆర్ఆర్ఆర్‌ను జాతీయ రహదారిగా ప్రకటించండి

- హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలి
- జాతీయ రహదారుల పనులు వెంటనే ప్రారంభించండి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



**న్యూఢిల్లీ, జూన్26(నమస్తే ఉదయం):** ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించాలని, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు.

ఈసందర్భంగా రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారుల ప్రకటన, ఇప్పటికే జాతీయ రహదారులుగా ప్రకటించిన మార్గాల పనుల ప్రారంభం తదితర విషయాలను కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. సంగారెడ్డి నుంచి నర్సాపూర్-తూప్రాన్-గజ్వేల్-జగదేవ్‌పూర్-భువనగిరి-చౌటుప్పల్ (158.645 కి.మీ.) రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించారని, దాని భూ సేకరణకు అయ్యే వ్యయంలో సగ భాగాన్ని తమ ప్రభుత్వమే భరిస్తోందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు.

ఈ భాగంలో తమ వంతు పనులు వేగవంతం చేశామని తెలిపారు. చౌటుప్పల్ నుంచి అమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డి వరకు (181.87 కి.మీ.) రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని కేంద్ర మంత్రి గడ్కరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి, ఈ ఏడాది ఎన్‌హెచ్ఏఐ వార్షిక ప్రణాళికలో నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ (ఓఆర్ఆర్ గౌరెల్లి జంక్షన్) నుంచి వలిగొండ-తొర్రూర్-నెల్లికుదురు-మహబూబాబాద్-ఇల్లెందు- కొత్తగూడెం వరకు రహదారిని (ఎన్‌హెచ్-930పీ) జాతీయ రహదారిగా ప్రకటించారని, ఇందులో కేవలం ఒక ప్యాకేజీ కింద 69 కి.మీ.లకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారని కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. హైదరాబాద్ వాసులు భద్రాచలం వెళ్లేందుకు 40 కి.మీ. దూరం తగ్గించే ఈ రహదారిని జైశ్రీరామ్ రోడ్‌గా వరంగల్ సభలో నితిన్ గడ్కరీ చెప్పిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

ఈ రహదారిలో మిగిలిన మూడు ప్యాకేజీలకు (165 కి.మీ) టెండర్లు పిలిచినందున వెంటనే పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రి గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ముఖ్యమంత్రి వెంట ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపీ వంశీ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ఉన్నారు.

**రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య రహదారి పనులు చేపట్టాలి..**

హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్ 65) జాతీయ రహదారిని 2024, ఏప్రిల్‌లోగా ఆరు వరుసలుగా విస్తరించాలి ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య కీలకమైన ఈ రహదారిలో రోజుకు 60 వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, వాహనాల రద్దీతో ప్రమాదాలు చోటు చేసుకొని పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

విపరీతమైన రద్దీ ఉన్నప్పటికీ రాష్ట్ర విభజనతో వాహన రద్దీ తగ్గిందని, తమకు సరైన ఆదాయం రావడం లేదంటూ కాంట్రాక్ట్ సంస్థ ఆరు వరుసల పనులు చేపట్టడం లేదని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలియజేశారు. ఎన్‌హెచ్ఏఐ, కాంట్రాక్ట్ సంస్థ మధ్య వివాదాన్ని పరిష్కరించి త్వరగా ఆరు వరుసలుగా రహదారి విస్తరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**ఐకానిక్ బ్రిడ్జి.. ఎలివేటెడ్ కారిడార్**

కల్వకుర్తి నుంచి కొల్లాపూర్-సోమశిల-కరివెన-నంద్యాల (ఎన్‌హెచ్-167కే) మార్గాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి 142 కి.మీ. పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారని కేంద్ర మంత్రి గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. మిగిలిన 32 కి.మీ.పనులకు, ఐకానిక్ బ్రిడ్జికి టెండర్లు పిలిచారని, ఆ పనులు వెంటనే ప్రారంభించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు.

ఈ రహదారి పూర్తయితే మిగతా.. 2లో



### ఓవైసీ లాంటివారితో
## దేశానికి ప్రమాదం


**ఇలాంటి వారిని పార్లమెంట్‌కు పంపడం ముప్పు**

**అసదుద్దీన్ పార్లమెంట్ వ్యాఖ్యలపై మండిపడ్డ మాధీవీలత**

**హైదరాబాద్,జూన్26(నమస్తే ఉదయం):** పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం సందర్భంగా హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత కొంపెల్ల మాధవీలత తీవ్రంగా స్పందించారు. ఒవైసీ పార్లమెంట్‌లో అల్లాహుఅక్బర్ తో పాటు జై పాలస్తీన్ అనడంపై ఆమె తీవ్ర అభ్యంతరం తెలిపారు. అల్లా అన్న నోటితో జై పాలస్తీన్ అనడం ఏంటని.. అతని ఉద్దేశాలు ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి వారి వల్ల దేశ భద్రతకు ముప్పు అని.. తక్షణం ఇతణ్ని విచారణ చేయాల్సి ఉందని ఓ వీడియోను విడుదల చేశారు. 'పార్లమెంటులో జై బోలో భారత్ మాతాకీ అనాల్సిన నోటి నుంచి జై పాలస్తీనా అనే మాట ఆయన నోటి నుంచి వచ్చిందంటే.. దేశానికే దౌర్భాగ్యం. ఇలాంటివారిని ప్రోత్సహిస్తున్నందుకు 130 కోట్ల మంది భారతీయులు మిగతా.. 2లో

## సీబీఐ అదుపులోకి కేజ్రీవాల్

**ఢిల్లీ లిక్కర్ కేసులో మరో కీలక పరిణామం**



**న్యూఢిల్లీ,జూన్26(నమస్తే ఉదయం):** ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ వ్యవహారంలో మనీల్యాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ముఖ్యమంత్రి , ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. తాజాగా,ఇదే కేసులో కేజ్రీవాల్‌ను సిబిఐ అరెస్ట్ చేసింది. ఆయన అరెస్ట్‌కు కోర్టు బుధవారం అనుమతించడంతో రౌస్ అవెన్యూ కోర్టులోనే సీబీఐ అదుపు లోకి తీసుకుంది. అనంతరం న్యాయమూర్తి అమితాబ్ రావత్ ఎదుట హాజరుపరిచిన అధికారులు ఐదు రోజుల కస్టడీకి కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. మిగతా.. 2లో

## రోడ్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

**అలా చేయలేనప్పుడు టోల్ వసూలు చేయరాదు**

**కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ,జూన్26(నమస్తే ఉదయం):** టోల్ ఛార్జీల వసూలు గురించి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. రోడ్లు సరిగా నిర్వహించలేనప్పుడు టోల్ వసూలు చేయొద్దని ఆయా ఏజెన్సీలకు సూచించారు. గుంతలతో కూడిన రోడ్లు, టోల్ ఎలాజాల వద్ద రద్దీ.. ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. శాటిలైట్ ఆధారిత టోల్ వసూలుపై నిర్వహించిన గ్లోబల్ వర్క్‌షాప్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మీరు మంచి సేవలు మిగతా.. 2లో

## గురుకులాల్లో భర్తీలు చేపట్టండి

**గాంధీభవన్ ముట్టడించిన అభ్యర్థులు**

**మద్దతు ప్రకటించిన ఎమ్మెల్యే హరీష్ రావు**




**హైదరాబాద్,జూన్26(నమస్తే ఉదయం):** గురుకులాల్లో ఉద్యోగాల భర్తీ డిసెండింగ్ ఆర్డర్‌లో చేపట్టాలని గురుకుల అభ్యర్థులు బుధవారం ఉదయం సీఎం రేవంత్ రెడ్డి నివాసంతో పాటు పెద్దమ్మ గుడి వద్ద భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేసారు. అక్కడ్నుంచి నాంపల్లిలోని గాంధీ భవన్‌కు చేరుకున్నారు. డిసెండింగ్ ఆర్డర్‌లో ఉద్యోగాల భర్తీ చేపట్టి, తమకు న్యాయం చేయాలని గాంధీభవన్ గేటు వద్ద నిరసనకు దిగారు. వి వాంట్ జస్టిస్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. గాంధీ భవన్‌ను ముట్టడించి నిరసన వ్యక్తం చేస్తున్న గురుకుల అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. గురుకుల అభ్యర్థుల నిరసనకు ఎమ్మెల్యే హరీష్ రావు మద్దతు ప్రకటించారు. అభ్యర్థుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న సోకాల్డ్ ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరం అని హరీశ్ రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా, సీఎం ఇంటి ముందు మోకాళ్ళ మీద నిలబడి ఎన్నిసార్లు అభ్యర్థించినా అభ్యర్థుల మొర ఆలకించకపోవడం శోచనీయమని హరీశ్‌రావు పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు అత్యున్నత, నాణ్యమైన రెసిడెన్షియల్‌తో కూడిన విద్యను పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో గురుకులాలు ఏర్పాటు చేసింది అని మాజీ మంత్రి గుర్తు చేశారు. రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న సోకాల్డ్ ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు మిగతా.. 2లో

## జిహెచ్ఎంసిలో కంటోన్మెంట్ విలీనం

**కేంద్రానికి తెలియచేసిన సిఎస్ శాంతికుమారి**

**హైదరాబాద్,జూన్26(నమస్తే ఉదయం):** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో సాధారణ ప్రజలు నివసించే ప్రాంతాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్




ఎంసీ)లో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశారు. కంటోన్మెంట్ మిగతా.. 2లో




## ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ తీర్పు రిజర్వ్


**హైదరాబాద్, జూన్ 26 (నమస్తే ఉదయం):** ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు తిరుపతన్న, భుజంగరావు, ప్రణీత్‌రావు బెయిల్ పిటిషన్లపై నాంపల్లి కోర్టులో వాదనలు పూర్తయ్యాయి. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును గురువారానికి రిజర్వు చేసింది. తాము బెయిల్ పిటిషన్ వేసినప్పుడు కోర్టులో ఛార్జిషీట్ లేదని నిందితుల తరఫు న్యాయవాది వాదించారు. కేసులో అరెస్టయిన 90 రోజుల్లో ఛార్జిషీట్ వేయకపోతే మ్యాండేటరీ/డిఫాల్ట్ బెయిల్ ఇవ్వొచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులు చెబుతున్నాయని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టులో ప్రస్తావించారు. 90 రోజుల్లోనే తాము ఛార్జిషీట్‌వేశామని, వివరాలు సరిగా లేవని తిప్పి పంపడంతో తిరిగి మళ్లీ వేసినట్లు పోలీసుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఛార్జిషీట్ తిప్పి పంపినంత మాత్రాన ఛార్జిషీట్ వేయనట్లు కాదన్నారు.



### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు
## కెటిఆర్ పరామర్శ

**హైదరాబాద్,జూన్26(నమస్తే ఉదయం):** చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు బుధవారం పరామర్శించారు. ఆయన సతీమణి మృతితో విషాదంలో ఉన్న సత్యం కుటుంబాన్ని పరామర్శించి కేటీఆర్ ఓదార్చారు. ఆల్వాల్‌లోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకొని రూపాదేవి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కేటీఆర్ వెంట కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు. కాగా.. ఎమ్మెల్యే సత్యం భార్య రూపాదేవి వారం క్రితం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆమెకు గైనిక్ సమస్యలు ఉన్నాయని, కడుపునొప్పి తట్టుకోలేకే బలవన్మరణానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### సింపుల్ గవర్నమెంట్..
## ఎఫెక్టివ్ గవర్నెన్స్



**కుప్పంలో సహా జిల్లాలో అభివృద్ధి పనుల అమలు**

**పేదరిక నిర్మూలన కుప్పం నుంచే ప్రారంభం**

**రెండోరోజు కొనసాగిన సిఎం చంద్రబాబు పర్యటన**

**ప్రజల నుంచి వినతులు స్వీకరణ..అధికారులకు దిశానిర్దేశం**

**చిత్తూరు,జూన్26(నమస్తే ఉదయం):** సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నెన్స్ నా విధానం అని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.. రానున్న రోజుల్లో కుప్పంలో సహా జిల్లాలో అభివృద్ధి పనుల అమలుపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని తన సొంత నియోజక వర్గం కుప్పం పర్యటనలో కీలక వ్యాఖ్యలు చేశారు సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నెన్స్ నా విధానమన్న ఆయన.. సాయంత్రం 6 గంటల తరువాత మంత్రులు సమావేశాలు పెట్టకండని చెప్పాను అన్నారు.. బలవంతపు జనసమీకరణతో పెద్ద పెద్దమీటింగ్‌లు, భారీ కాన్వాయ్ లతో సైరన్ల మోతతో హంగామాలు తమ ప్రభుత్వంలో ఉండబోవు అన్నారు.. ఇక, అధికారులు ఫిజికల్.. వర్చ్యువల్ పని విధానాలకు సిద్ధపడాలని సూచించారు. కుప్పం అభివృద్ధికి సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు.. మిగతా.. 2లో



జిహెచ్ఎంసి నూతన కమిషనర్ ఆమ్రపాలకి
పూల మొక్కను అందజేస్తున్న పూర్వపు కమిషనర్ రోనాల్డ్ రోస్



జిహెచ్ఎంసి కమిషనర్గా పదవి బాధ్యతలు
స్వీకరించిన ఆమ్రపాలి



జిహెచ్ఎంసి నూతన కమిషనర్ ఆమ్రపాలికి బాధ్యతలు
అప్పజెప్పున్న పూర్వపు కమిషనర్ రోనాల్డ్ రోస్

# జిహెచ్ఎంసి నూతన కమిషనర్గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆమ్రపాలి కాట

హైదరాబాద్, జూన్ 26(నమస్తే ఉదయం): జిహెచ్ఎంసి నూతన కమిషనర్గా బుధవారం ఐఏఎస్ అధికారిని ఆమ్రపాలి కాట బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో ఐఏఎస్ల బదిలీల నేపథ్యంలో జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ను బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో ఆమ్రపాలి కాటకు జిహెచ్ఎంసి కమిషనర్, ఎఫ్ఏసిగా ప్రభుత్వం నియమించింది. ఆ మేరకు రోనాల్డ్ రోస్, నుండి ఆమె బాధ్యతలను స్వీకరించారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ ఆమ్రపాలిని జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛా లని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిలు కమిషనర్ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



# జీడి గడ్డ తండాకు బిటి రోడ్డు పనులు ప్రారంభించేది ఇంకెన్నాళ్ళు..?

**గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 1.20 కోట్ల నిధులు మంజూరు**

**పాలకులు మారిన... తండాల అభివృద్ధి మాత్రం శూన్యం.**

**ఇంకెన్నాళ్లు ఈ రొడ్డుతో గోస అంటూ ఆవేదన**

షాద్ నగర్,జూన్26(నమస్తే ఉదయం): గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపరచడానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫరూఖ్ నగర్ మండలం వెలి జర్ల గ్రామానికి చెందిన జీడి గడ్డ తండాకు బిటి రోడ్డు నిర్మాణానికి 1.20 కోట్ల నిధులు మంజూరు చేశారు.అంతలోనే శాసనసభ ఎన్నికల కోడ్ కూసింది.ఎన్నికల అనంతరం టిఆర్ఎస్ పార్టీ ఓటమి పాలు కావడంతో రోడ్డు పనులు పెండింగ్లో పడ్డాయి.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పాలన మొదలైన జీడిగడ్డ రోడ్డు మరమ్మతుల పై ఊసే లేదని తండవాసులో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.చినుకు పడితే ప్రధాన రహదారి పై కాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని విద్యార్థులు ఉద్యోగులు రైతులు వాపోతున్నారు.రైతులు పండించిన పంటలు,అత్యవసర సమయంలో వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి ఉన్న ప్రాంతాలకు తరలి వెళ్లే క్రమంలో గుంతల మయంగా మారిన రోడ్డుతో వాహనాలు ధ్వంసం అవుతున్నాయని ,దీంతో తండా వైపు ఎవ్వరు రావడంలేదని దిగులు చెందుతున్నారు.షాద్ నగర్ శాసనసభ సభ్యులు వీర్ల పల్లి శంకర్ ప్రత్యేక చొరవ తీసుకొని రోడ్డు పనులు ప్రారంభం అయ్యేలా సహాయ సహకారాలు అందించాలని తండావాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# దక్షిణ ఆర్ఆర్ఆర్ను జాతీయ రహదారిగా ప్రకటించండి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ వాసులకు తిరుపతికి 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని వివరించారు. కల్వకుర్తి-నంద్యాల రహదారి (ఎన్హెచ్ -167కే) హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో ఉన్న రహదారిలో (ఎన్హెచ్ 765కే) 67 కిలోమీటర్ వద్ద (కల్వకుర్తి) ప్రారంభమవుతుందని, ఎన్హెచ్ 167కే జాతీయ రహదారి పనులు చేపట్టినందున, హైదరాబాద్- కల్వకుర్తి వరకు ఉన్న (ఎన్హెచ్ 765కే) రహదారిని రెండు వరుసల నుంచి నాలుగు వరుసలుగా విస్తరించాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

కల్వకుర్తి-కరివెన వరకు జాతీయ రహదారి పూర్తయ్యే లోపు హైదరాబాద్-కల్వకుర్తి రహదారిని నాలుగు వరుస లుగా విస్తరణకు అనుమతులు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్-శ్రీశైలం (ఎన్హెచ్ 765) మార్గంలో 62 కిలోమీటర్లు ఆమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉందని, అటవీ అనుమతులు లేక అక్కడ పనులు చేపట్టలేదని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలిపారు. ఈ మార్గంలో నిత్యం ఏడువేలకుపైగా వాహన రాకపోకలు సాగి స్తాయని, ఈ నేపథ్యంలో ఆమ్రాబాద్ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్కు అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

### మంథనికి జాతీయ రహదారి ప్రకటించండి..

మంథని నుంచి సీనియర్ మంత్రి శ్రీధర్బాబు ప్రాతినిధ్యం వహి స్తున్నారని, మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు, మాజీ సభాపతి శ్రీపాదరావు గతంలో ప్రాతినిధ్యం వహిం చారని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియ జేశారు. ఇప్పటి వరకు జాతీయ రహదారుల చిత్రంలో మంథ నికి చోటు దక్కలేదని, జగిత్యాల-పెద్దపల్లి-మంథని-కాటారం రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని, తగిన నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు.

ఈ రహదారి పూర్తయితే ఎన్హెచ్-565, ఎన్హెచ్-353సీ అనుసంధానమవుతాయని, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్ ప్రజలకు అనువుగా ఉంటుందని, దక్షిణ కాశీగా గుర్తింపు పొందిన కాళేశ్వరం క్షేత్రానికి అనుసంధానత పెరుగు తుందని ముఖ్యమంత్రి కేంద్రమంత్రికి వివరించారు.

### కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఇతర అంశాలు...

తెలంగాణను కర్ణాటక, మహారాష్ట్రను అనుసంధానించే హైదరాబాద్-మన్నెగూడ నాలుగు వరుసల జాతీయ రహదారిగా (ఎన్హెచ్-163) ప్రకటించడంతో భూ సేకరణ పూర్తి చేశాం. టెండర్లు పిలవడం పూర్తయిన ఎన్జీటీలో కేసు వలన పనులు ప్రారంభం కాలేదు. ఆ మార్గంలో ఉన్న మర్రి చెట్లను కేంద్ర పర్యావరణ శాఖ నిబంధనల ప్రకారం ట్రాన్స్లోకేషన్ చేసేం దుకు ఎన్హెచ్ ఏఐ అంగీకరించింది. ఈ దశలో ఎలైన్మెంట్ మార్చడం సాధ్యం కాదు. సంబంధిత శాఖలకు తగిన ఆదేశాలు జారీ చేసి ఈ మార్గం పనులు వెంటనే ప్రారంభించాలి.

సేతు బంధన్ స్కీం కింద 2023-24లో రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన 12 ఆర్వోబీలు/ఆర్యూబీలను వెంటనే మంజూరు చేయాలి.

జగిత్యాల-కాటారం (130 కి.మీ.), దిండి-నల్గొండ (100 కి.మీ.), భువనగిరి-చిట్యాల (44 కి.మీ), చౌటుప్పల్-సంగారెడ్డి (182 కి.మీ), మరికల్-రామసముద్రం (63 కి.మీ.), వనపర్తి-మంత్రాలయం (110 కి.మీ.), మన్నెగూడ-బీదర్ (134 కి.మీ.), కరీంనగర్-పిట్లం (165 కి.మీ.), ఎర్రవెల్లి క్రాస్ రోడ్-రాయచూర్ (67 కి.మీ.), కొత్తపల్లి-దుద్దెడ (75 కి.మీ.), సారపాక-ఏటూరు నాగారం (93 కి.మీ.), దుద్దెడ-రాయగిరి క్రాస్ రోడ్ (63 కి.మీ.), జగ్గయ్యపేట-కొత్తగూడెం (100 కి.మీ.), సిరిసిల్ల-కోరట్ల (65 కి.మీ.), భూత్పూర్-సిరిగిరిపాడు (166 కి.మీ.), కరీంనగర్-రాయపట్నం (60 కి.మీ.) మొత్తం 1617 కి.మీ.జాతీయ రహదారులను అప్గ్రేడ్ చేయాలి.

# సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నెన్స్

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు.. కుప్పంలో రౌడీయిజం, హింసం, గంజాయి, అక్రమాలు కనిపించకూడదు అని స్పష్టం చేశారు.. రాజకీయ ప్రోద్భలంతో పెట్టిన తప్పుడు రౌడీ షీట్లు ఎత్తేవేయండి అన్నారు.. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కుప్పం నుండే శ్రీకారం చుట్టనున్నట్టు వెల్లడించారు. మరోవైపు.. కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన ముగిసింది.. పీఈఎస్ మెడికల్ కళాశాలలో పార్టీ శ్రేణుల సమావేశం అనంతరం.. రెండు రోజుల కుప్పం పర్యటన ముగించుకొని ప్రత్యేక హెలి కాప్టర్లో బెంగళూరు బయల్దేరి వెళ్లారు సీఎం చంద్రబాబ నాయుడు. సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. స్థానిక ఆర్అండ్బీ అతిథి గృహం వద్ద ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్న ప్రజలు.. తమ సమస్యలను సీఎంకు వివరించారు. వినతులను సీఎం అందరి నుంచి స్వయంగా తీసుకుని పరిశీలించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అధికారులను ఆయన ఆదేశించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో మీరు పడ్డ కష్టాలన్నీ నాకు గుర్తున్నాయిమీ ఆత్మస్థైర్యం ముందు నాటి ప్రభుత్వ కుట్రలు పని చేయలేదుపార్టీ కోసం కష్టపడి పని చేసిన వారిని గుర్తించి పదవులిచ్చే బాధ్యత నాది-కుప్పం నియోజకవర్గ కార్యకర్తలు, నేతల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కష్టపడి పని చేసిన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూసుకునే బాధ్యత తనదని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. టీడీపీని బలహీన పరచాలనుకున్న నాటి ప్రభుత్వ కుట్రలు నేతలు, కార్యకర్తల ఆత్మస్థైర్యం ముందు పని చేయలేదన్నారు. కుప్పం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో చంద్రబాబు బుధవారం సమావేశమయ్యారు. గత ఐదేళ్ల పనితీరును, ఎన్నికల్లో అవలంభించిన విధానాలపై చంద్ర బాబు సమీక్షించారు. 2029 ఎన్నికలకు ఏ ప్రణాళికతో పనిచేయాలో నేతలు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం వారిని ఉద్దేశించి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.... 8 సార్లు నేను కుప్పం నుండి ఎమ్మెల్యేగా గెలిచాను...గత ఐదేళ్లలో పాలనలో జరిగినంత హింస, దాడులు, దారుణాలు ఏనాడూ చూడలేదు. నన్ను నైతికంగా దెబ్బతీయాలని చూశారు...స్థానిక నేతలు, కార్యకర్తలపై దాడులు చేసి, ప్రలోభాలకు గురిచేసి నాయకత్వాన్ని దెబ్బతీయాలని చూశారు. అయినా వారి ఎత్తులు సాగలేదు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారు. టీడీపీ అభ్యర్థులను కనీసం నామినేషన్ కూడా వేయనీయలేదు. నేను జిల్లా పర్యటనకు వస్తే జీవో-1 తెచ్చి రాకుండా అడ్డుకున్నారు... నిరసన తెలిపిన కార్యకర్తలపైనా అక్రమ కేసులు బనాయించారు. అక్రమంగా 10 మందిని అరెస్టు చేసి 30 రోజుల పాటు జైల్లో పెట్టారు. ఇలా ఒకటని కాదు...అన్ని విధాలుగా ప్రయత్నించి కుప్పంలో టీడీపీని దెబ్బకొట్టాలని చూశారు. వాటన్నింటిని తట్టుకుని మీరు పని చేశారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి నాటి ప్రభుత్వం రూపాయి కూడా ఖర్చులేదు. సామాన్య కార్యకర్తలను మంత్రులు, ఎంపీలను చేసిన చరిత్ర టీడీపీది 'నాపై రెండు గురుతర బాధ్యతలున్నాయి. ఒకటి కుప్పంను దేశంలోనే నెంబర్ -1 నియోజకవర్గంగా అభివృద్ధి వైపు తీసుకెళ్లడం...రెండు కుప్పంలో పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారిని గుర్తించి పదవులు ఇవ్వడం. మీరంతా ప్రజలతో మమేకమై బాగుండాలి...గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు మీరు కూడా చేయొద్దు. గత ప్రభుత్వానికి...మన ప్రభుత్వానికి మధ్య మార్పు ప్రజలకు కనిపించాలి. మనమంతా క్రమశిక్షణ, బాధ్యతతో ఉండాలి. బాగా పని చేస్తే ఏ స్థాయి నాయకుడు అయినా...వారి ఇంటకి వెళ్లి నేనే అభినందనలు తెలుపుతా.

నా చుట్టూ తిరగకుండా పార్టీపై దృష్టి పెట్టాలి. సామాన్య కార్యకర్తలను ఎంపీలు, మంత్రులుగా చేసిన చరిత్ర మన టీడీపీకి ఉంది. కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే పూచి నాది.' అని సీఎం చంద్రబాబు నాయుడు టీడీపీ నేతలు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

# సీబీఐ అదుపులోకి కేజ్రీవాల్

(మొదటి పేజీ తరువాయి)

ఇదే కేసులో ట్రయల్ కోర్టు గత గురువారం కేజ్రీవాల్కు బెయిల్ మంజూరు చేయగా, దీనిపై ఈడీ హైకోర్టును ఆశ్రయించింది. దిగువ న్యాయస్థానం తమ వాదనలకు తగినంత సమయం ఇవ్వలేదని ఆరోపించింది. దీంతో ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. ఈడీ సమర్పించిన ఆధారాలను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోవడంలో విఫలమైందని, బెయిల్ మంజూరులో నిర్ణయం తీసుకునేటప్పుడు సమగ్ర పరిశీలన చేయలేదని ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. అయితే హైకోర్టు నిర్ణయం వెలువడిన తరువాత దీనిపై విచారణ చేపడతామని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు వెలువడడంతో బుధవారం దీనిపై విచారణ చేపట్టింది. అయితే ఈ పిటిషన్ను తాజాగా కేజ్రీవాల్ తరఫున న్యాయ వాదులు వెనక్కు తీసుకున్నారు. పిటిషన్ ఉపసంహరించుకుంటామని కేజ్రీవాల్ కోరగా, అందుకు జస్టిస్ మనోజ్మిశ్రా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిల ద్విసభ్య ధర్మాసనం అనుమతించింది. హైకోర్టు పూర్తిస్థాయి ఉత్తర్వులు, సిబిఐ అరెస్ట్ వంటి పరిణామాల నేపథ్యంలో సమగ్ర పిటిషన్ దాఖలు చేస్తామని కేజ్రీవాల్ తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ న్యాయస్థానానికి తెలిపారు. అయితే కేజ్రీవాల్ అరెస్టుకు సీబీఐకి కోర్టు అనుమతివ్వడంపై ఆయన తరఫు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇది అత్యంత పక్షపాతంతో కూడిన చర్యగా వ్యాఖ్యానించారు. ఇప్పటికే కేజ్రీవాల్ను 9 గంటల పాటు ఏప్రిల్లో సిబిఐ ప్రశ్నించిందని, ఆయన తరఫు న్యాయవాది విక్రమ్ చౌదరి అన్నారు. ఈ కేసు ఆగస్టు2022 నుంచి పెండింగ్లో ఉంది.. నన్ను సాక్షిగా పిలిచారు.. నేను హాజరయ్యాను. తొమ్మిది గంటల పాటు విచారణ జరిగింది. అప్పటి నుంచి ఒక్క నోటీస్ కూడా సిబిఐ నుంచి రాలేదు. సాక్షి నుంచి నిందితుడిగా ఎలా మారారు. ఇది చాలా దారుణం అని మండిపడ్డారు. తన వాదన వినిపిస్తూ కేజ్రీవాల్ దురుద్దేశంతో కూడిన అనవసర అరోపణలు చేస్తున్నారని సిబిఐ పేర్కొంది.

# ఢిల్లీలో తెలంగాణ ప్రతినిధిగా జితేందర్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

పెట్టిన అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. తెలంగాణను స్పోర్ట్స్ హబ్గా తీర్చి దిద్దేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. కృష్ణా నుంచి రావాల్సిన నీటి వాటా కూడా రాలేదన్నారు. సాగునీరు, త్రాగు నీరు సాధించడం కోసం రాజీలేని పోరాటం చేస్తానని చెప్పారు. బీబీనగర్ ఎయిమ్స్ విషయంలో కూడా కేంద్రం చాలా అంశాలను పెండింగ్ లో పెట్టిందని తెలిపారు. కేంద్రంలోని అన్ని మంత్రిత్వ శాఖలపై ఒత్తిడి తెస్తాం..ఎన్నో పెండింగ్ సమస్యలు ఉన్నాయన్నారు.

ఏపీ భవన్ విషయంలో ఎటువంటి అనుమతి అవసరం లేదన్నారు. ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం కోసం కసరత్తు మొదలైందన్నారు. త్వరలోనే ఢిల్లీలో తెలంగాణాకు కొత్త భవనం నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపిలు మల్లురవి,రఘురామి రెడ్డి,బలరాం నాయక్,చామల కిరణ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్యేలు వివేక్, యన్నం శ్రీనివాస్ రెడ్డి,మల్రెడ్డి రంగారెడ్డి, శ్రీహరి,మాజీ మంత్రి జానారెడ్డి హాజరయ్యారు.

# ఓవైసీ లాంటివారితో దేశానికి ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించుకోవాలి. రజాకార్ల నుంచి వచ్చి.. వారిని చంపి వారి ఎంఐఎం పార్టీని కైవసం చేసుకొని గత 40 నుంచి 50 ఏళ్ల నుంచి తెలంగాణలో పాలన చేస్తున్నారు. ఇక్కడ ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో.. వీరికి మద్దతివ్వడం ఆనవాయితీగా వస్తోందని మండిపడ్డారు. తమ్ముడు చిటికె వేస్తాడు.. 15 నిమిషాల్లో ఖబడ్దార్ ఈ దేశాన్ని శ్మశానం చేస్తా అంటాడు. నేను ఆపాను కాబట్టే అతను ఆగుతున్నాడు.. లేదంటే ఏం చేస్తాడో చూస్కోండి అని అన్న అంటాడు. వీరు ఏం చేస్తారు? జై పాలస్తీన్ అని పార్లమెంట్లో అన్నప్పుడు వీరి మనస్తత్వం ఏంటి? ఇలాంటి వారిని మనం పార్లమెంట్లోకి తీసుకొచ్చి కూర్చోబెడుతున్నాం. ప్రశ్నించేవారు లేరా? ఈ దేశ సంరక్షణ ఏ దిశగా వెళ్తోంది. 130 కోట్ల జనాభా మధ్యలో ఇలాంటి వారు మనతో ఉండడమే కాకుండా.. అక్రమ మార్గంలో ప్రజాప్రతినిధులై పార్లమెంటులో కూర్చొంటే దానికి రక్షణ ఎక్కడుంది? వీరు హమాస్ వాళ్లా? వారి కోసం పని చేస్తారా? హమాస్ ఆశయాలను భారత దేశంలో అమలు చేయడానికో.. లేదా వారిని సంతృప్తి పర్చడం కోసం ఇక్కడ పని చేస్తున్నారా? ఏ దేశంలో అయినా పుట్టిన వారు అదే తన మాతృభాష, మాతృభూమిని పాటించి, అదే తన జీవిత లక్ష్యం అని అనుకుంటారు. వీరి ఉద్దేశం అలా లేదు. వీరెప్పుడూ పేరు, ప్రఖ్యాతి, డబ్బు కోసం పరితపించే వికృతమైన వ్యక్తులు వీరు. భగవత్ నామం అల్లా అని పేరు చెప్పి.. జై పాలస్తీన్ అన్నాడంటే.. అతని మనస్సులోంచి వచ్చిన మాటలివి. అతను ఎందుకు ఈ మాటలు అన్నాడు. కచ్చితంగా జాతీయ భద్రతా మండలి వారు ఒవైసీని కూర్చోబెట్టి ప్రశ్నించాలి. అతని మదిలో ఏ ఆలోచనలు ఉన్నాయో తేల్చాలి. ఇప్పుడు కనుక మనం మేల్కొకపోతే, పరిష్కరించుకోకపోతే.. ఈ భారత్ శత్రువులకు పాలు పోసి పెంచినట్లు అవుతుంది' అని మాధవీ లత అన్నారు.

# రోడ్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

అందించలేనప్పుడు టోల్ ఛార్జీ వసూలు చేయొద్దు. రోడ్లు బాగా లేకపోతే ప్రజలు హర్షించరు. చాలామంది ఇప్పటికే సోషల్మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. కాబట్టి మంచి రోడ్లు అందివ్వలేనప్పుడు టోల్ వసూలు చేయకూడదు. ఒకవేళ గుంతలతో కూడిన రోడ్లపై టోల్ వసూలు చేస్తే రాజకీయ నాయకులుగా మేం ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది' అని గడ్కరీ అన్నారు. టోల్ ప్లాజాల వద్ద ఆలస్యం కాకుండా చూడాలని నేషనల్ హైవే ఫీల్డ్ ఆఫీసర్లకు సూచించారు. శాటిలైట్ ఆధారిత టోల్ ఛార్జీల వసూలు విధానాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రారంభించనున్నట్లు గడ్కరీ తెలిపారు. తొలి దశలో 5 వేల కిలోమీటర్ల రహదారులపై ఈ టోల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. తొలుత కమర్షియల్ వాహనాలకు ఒక లేన్లో అనుమతిస్తారు. టోల్ వసూలుకు కీలకమైన వెహికల్ ట్రాకర్ సిస్టమ్ యూనిట్ను ఆయా వాహనాల్లో అమర్చాల్సి ఉంటుంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే వాహనాలు టోల్ ఎ÷-లాజాల వద్ద ఆగాల్సిన అవసరం ఉండదు. దశలవారీగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నారు. ఈ విధానం వల్ల ప్రభుత్వానికి రూ.10వేల కోట్లు అదనపు ఆదాయం సమకూరనుందని గడ్కరీ తెలిపారు.

# గురుకులాల్లో భర్తీలు చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి)

కనిపించకపోవడం బాధాకరం అని హరీశ్రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా, సీఎం ఇంటి ముందు మోకాళ్ళ మీద నిలబడి ఎన్నిసార్లు అభ్యర్థించినా అభ్యర్థుల మొర అలకించకపోవడం శోచనీయమని హరీశ్రావు పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు అత్యున్నత, నాణ్యమైన రెసిడెన్షియల్తో కూడిన విద్యను పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో గురుకులాలు ఏర్పాటు చేసింది అని మాజీ మంత్రి గుర్తు చేశారు. గురుకులాల్లో టీచర్ల కొరత లేకుండా చేసి, విద్యాప్రమాణాలు మరింత పెంచేందుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో 9210 టీచర్ పోస్టుల భర్తీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిరుద్యోగులకు నష్టం జరగకుండా ఉండాలని, ఒక్క పోస్ట్ కూడా మిగిలిపోవద్దనే లక్ష్యంతో ఉన్నత హోదా పోస్టుల నుండి ప్రారంభించి కింది స్థాయి పోస్టుల వరకు ఫలితాలు వెల్లడించి భర్తీ చేయాలని నిర్ణయించింది. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇందుకు భిన్నంగా వ్యవహరించడం వల్ల ఒకే అభ్యర్థికి ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు రావడం జరిగింది. దీనివల్ల దాదాపు 2500 పైగా టీచర్ పోస్టులు మిగిలిపోయి, అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, పోస్టులు బ్యాక్లాగ్ అవ్వ కుండా తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పోస్టులు భర్తీ చేసి, అభ్యర్థులకు, నిరుద్యోగులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్రావు పేర్కొన్నారు.

# జిహెచ్ఎంసిలో కంటోన్మెంట్ విలీనం

(మొదటి పేజీ తరువాయి)

బోర్డుల పరిధిలోని ప్రాంతాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసే అంశంపై కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి ఎ.గిరిధర్ న్యూఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ఉన్నతాధికారులతో మంగళవారం వర్చువల్గా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పాల్గొన్న సీఎస్ శాంతికుమారి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని కేంద్ర మంత్రికి తెలియజేశారు. బ్రిటిష్ పాలన నుంచి దేశంలో కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులను రద్దు చేయాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర మంత్రి గిరిధర్ఈ సందర్భంగా తెలిపారు. అందువల్ల విలీన పక్రియను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్రాలను కోరారు. ఇందుకు స్పందించిన సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. కేంద్ర ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమ్మతి తెలిపిందని వివరించారు. కంటోన్మెంట్ పరిధి నుంచి సాధారణ ప్రజలు నివసించే ప్రాంతాలు(సివిల్ ఏరియా) తొలగింపు విధివిధానాల ఖరారుకు కేంద్రం ఏర్పాటుచేసిన కమిటీ రాష్ట్ర ప్రభుత్వంతో ఇంకా చర్చించలేదని తెలిపారు. విలీన పక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసి పని చేస్తున్నదని చెప్పారు. మున్సిపల్శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, మున్సిపల్, కంటోన్మెంట్ బోర్డు అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వీర సురేష్

## రాజేంద్రనగర్‌లోని కూరగాయల పరిశోధన స్థానానికి ఉత్తమ పరిశోధనా స్థానంగా అవార్డు

**రాజేంద్రనగర్, జూన్26(నమస్తే ఉదయం):** శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం కు అనుబంధంగా ఉన్న రాజేంద్రనగర్ లోని కూరగాయల పరిశోధన స్థానానికి జాతీయస్థాయిలో 2023 - 24 సంవత్సరానికి గాను ఉత్తమ పరిశోధన స్థానంగా అవార్డు దక్కింది. ఈనెల 25 నుంచి 27 వరకు గుజరాత్ లోని నవసారి లో జరుగుతున్న అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం( దుంప పంటలు) వార్షిక సమావేశాలలో ఈ అవార్డును కూరగాయల పరిశోధన స్థానం కు చెందిన డాక్టర్ వీర సురేష్ అందుకున్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన 30 పరిశోధన కేంద్రాలలో రాజేంద్రనగర్‌కు అవార్డు రావడం పట్ల ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్ కుమార్, దక్షిణ తెలంగాణ వ్యవసాయ వాతావరణ ప్రాంత జోనల్ హెడ్ డాక్టర్ సురేష్ కుమార్ రెడ్డి, కూరగాయల పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ అనిత కుమారిలు హర్షం వ్యక్తం చేశారు.

## జలమండలి ఎండీగా అశోక్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

**జలమండలి నూతన ఎండీగా అశోక్ రెడ్డి**
**ప్రధాన కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ**
**ఘన స్వాగతం పలికిన అధికారులు, ఉద్యోగులు**

**హైద్రాబాద్,జూన్ 26(నమస్తే ఉదయం):** జలమండలి నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా అశోక్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఉదయం 10.15 గంటల సమయంలో ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఆయనకు.. జలమండలి ఉన్నతాధికారులు,ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మేనేజింగ్ డైరెక్టర్ ఛాంబర్ లో ఇప్పటిదాకా ఎండీగా పని చేసిన సుదర్శన్ రెడ్డి నుంచి ఆయన ఛార్జ్ తీసుకున్నారు.


జలమండలి నూతన ఎండి అశోక్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగి రాజకుమార్


జలమండలి నూతన ఎండి అశోక్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పూర్వ ఎండి సుదర్శన్ రెడ్డి

గతంలోనూ జలమండలితో అనుబంధం అశోక్ రెడ్డికి ఇప్పటికే జలమండలితో అనుబంధం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన రెండేళ్లపాటు జలమండలిలో పనిచేశారు. 2009 నుంచి 2011 మధ్య కాలంలో ఆయన జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ), ఫైనాన్స్ డైరెక్టర్‌గా సేవలు అందించారు. తర్వాత 2012 నుంచి 2014 వరకు జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ గా పనిచేశారు.2019లో 9 నెలల పాటు మూసీ రివర్ డెవలప్ మెంట్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ గానూ పని చేసిన అనుభవమూ ఆయన సొంతం.ఇప్పటి దాకా ఎండీగా పని చేసిన సుదర్శన్ రెడ్డి..సాధారణ పరిపాలన శాఖకు బదిలీపై వెళ్లారు.ఆయన గతేడాది డిసెంబరు 18న జలమండలి ఎండీగా బాధ్యతలు చేపట్టారు.దాదాపు 7 నెలలు ఆ బాధ్యతలు నిర్వర్తించారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన థాయ్‌లాండ్ మేఫా యూనివర్సిటీ ప్రొఫెసర్లు

**రాఘవేంద్ర నగర్, జూన్26(నమస్తే ఉదయం):** థాయిలాండ్ కు చెందిన స్కూల్ ఆఫ్ ఆగ్రో ఇండస్ట్రీ ఆఫ్ మేఫా యూనివర్సిటీ ప్రొఫెసర్లు మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని


వ్యవసాయ విశ్వవిద్యాలయంను సందర్శించిన థాయ్‌లాండ్ మేఫా యూనివర్సిటీ ప్రొఫెసర్లు

సందర్శించారు. పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామి రెడ్డి, ఇతర విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

మేఫా యూనివర్సిటీ చేపడుతోన్న అకడమిక్ కార్యక్రమాల గురించి ప్రొఫెసర్ల బృందం వివరించింది. పండ్లు, కూరగాయలలో పంటకోత అనంతర టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, వంటి అంశాలలో ఉన్న అవకాశాల గురించి చర్చించారు. అలాగే విద్యార్థులు, ఫ్యాకల్టీ, ఎక్సెంజ్ ప్రోగ్రామ్స్ గురించి కూడా చర్చించారు. ఇరు సంస్థలు పరస్పర సహకారంతో ఏయే అంశాలలో కలిసి పనిచేయాలన్న అంశాలపై కూడా ఇరు సంస్థల అధికారులు చర్చలు జరిపారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ కార్యక్రమాల విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, ఇక్రిశాట్‌కు చెందిన ఇన్నోవేషన్ హబ్, డిజిటల్ అగ్రికల్చర్ హెడ్ డాక్టర్ ఆర్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




డ్రగ్స్ వల్ల చేకూరే నష్టాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ బి ఎస్ సంతోష్, జడ్పీ చైర్మన్ సరిత, అవగాహన ర్యాలీలో జడ్పీ చైర్మన్ సరిత

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలి

### - జడ్పీ చైర్ పర్సన్ సరిత

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 26 (నమస్తే ఉదయం):** జోగులాంబ గద్వాల జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలని జడ్పీ చైర్ పర్సన్ సరిత పిలుపునిచ్చారు. బుధవారం మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గద్వాల కృష్ణవేణి చౌరస్తాలో మిషన్ పరివర్తన పేరుతో నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, ఎస్పీ టి.శ్రీనివాసరావుతో కలిసి జడ్పీ చైర్పర్సన్ సరిత ప్రారంభించారు. పాత బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీ అనంతరం ఆమె మాట్లాడుతూ, డ్రగ్స్ తీసుకోవడం వలన కలిగే నష్టాలపై విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందుకెళ్లాలన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు యువత తమ వంతు కృషి చేయాలని సూచించారు.

విద్యార్థులు చదువు పైనే దృష్టి పెట్టి తమ భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దుకోవాలని, మాదకద్రవ్యాల బారిన పడితే జీవితాంతం బాధపడాల్సి వస్తుందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కొరకు పోలీసులే కాకుండా ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా స్వీకరించి అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. జీవితంలో స్థిర పడాల్సిన సమయంలో దురలవాట్లకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, రాబోయే భవిష్యత్తును బంగారు బాటలు వేసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ మాట్లాడుతూ... 1989 నుంచి ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నామని, దీని ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. డ్రగ్స్ అమ్మేవారి గురించి పౌరులు తమ బాధ్యతగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

డ్రగ్స్ బారిన పడిన యువతను కుటుంబ సభ్యులు అవసరమైన చికిత్స చేయించాలని కోరారు. జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. 17-18 ఏళ్లలోపు యువత డ్రగ్స్ బారిన పడేందుకు ఎక్కువగా అవకాశం ఉందని, ఈ సమయంలో వీరికి డ్రగ్స్ వలన కలిగే నష్టాల గురించి వివరించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా విద్యార్థులు చక్కగా చదువుకోవాలని శారీరకంగా, మానసికంగా బలంగా ఉండ వచ్చని పేర్కొన్నారు. యువత




మత్తు పానీయాలు, సిగరెట్లు, గుట్కాలు, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ విలువైన ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దన్నారు.

జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పౌరులు మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా మాదక దవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కూడా పటిష్టమైన చర్యలు చేపట్టిందని, జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వ ర్యంలో కూడా మాదకద్రవ్యాల నిర్మూలన కొరకు కట్టదిట్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో యాంటీ నార్కోటెక్ బ్యూరో ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.విద్యార్థులు అందరు ఈ దశ నుండే మాదక ద్రవ్యాల వల్ల జరిగే దుష్పరి ణామాల గురించి అవగాహన పెంచుకొని కుటుంబ సభ్యులకు , తమ గ్రామలలో ప్రజలను చైతన్యం చెయ్యాలని అన్నారు. రాష్ట్రంలోకి మాదక ద్రవ్యాల ను రాకుండ చూసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్ రాష్ట్రం లోకి రాకుండ చూడాలని, డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరు తమ బాధ్య తగా భావించి వీటి బారిన పడకుండా యువత సురక్షితంగా ఉండాలన్నారు.ఈ



సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ డ్రగ్స్ నివారణకు సంబంధించిన ప్రతిజ్ఞను విద్యార్థులు, అధికారులతో చేయించారు. డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలులో విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిథులు ప్రశంసా పత్రాలు అందజేశారు.

'ఐయాం యాంటీ డ్రగ్ షోల్డర్' అనే పేరుతో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద జడ్పీ చైర్ పర్సన్ సరిత, కలెక్టర్ బి. ఎం. సంతోష్, ఎస్పీ టి .శ్రీనివాసరావు, తదితరులు సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, అదనపు ఎస్పీ గుణశేఖర్, డి.ఎస్పీ సత్యనారాయణ వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నివారణకు ప్రతి ఒక్కరు కలిసి రావాలి

**డ్రగ్స్ వాడకంపై అవగాహనా ర్యాలీ కార్యక్రమాలు.**
**హాజరైన ఎమ్మెల్యే, డిఎస్పి, ఎక్సైజ్ సీఐ, సిఐ, యువ నాయకులు.**
**రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే**

**షాద్ నగర్,జూన్ 26 (నమస్తే ఉదయం):** డ్రగ్స్ నివారణకు ప్రతి ఒక్కరు కలిసి రావాలని,అందుకోసం డ్రగ్స్ వాడకంపై అవగాహనా ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించాల్సిన ఆవశ్యం ఉన్నదని అన్నారు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి.బుధవారం కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి,అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ డ్రగ్స్ నివారణ దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,డిఎస్పి వెంకటేశ్వర్లు,ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి,సిఐ నాగార్జున,యువ నాయకులు,జర్నలిస్టులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ వాడకం వల్ల యువత దీనికి బానిసై బలైపోతున్నారు.ఇది సరదాగా మొదలై అలవాటు తయారై వ్యసనంగా మారి విద్యార్థుల బంగారు భవిష్యత్తును పాడుజేస్తుందన్నారు. ఆరోగ్యం దెబ్బతిని, జీవితం అర్ధాంతరంగా ముగుస్తుందని తెలియజేశారు .డ్రగ్స్ వాడకానికి దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.అలాగే ఈ సందర్భంగా కల్లకుర్తి ప్రభుత్వం కళాశాల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలను సాధిస్తూ ఉత్తమ విద్యార్థులను తయ్యారు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.




సాధారణమైన విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధిస్తున్న కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి,లెక్చరర్స్‌ని అభినందించారు.

లెక్చరర్స్ సహకారంతో పట్టుదలగా చదువుకొని ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు సాధించిన సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,ఆనంద్ కుమార్,డిఎస్పి వెంకటేశ్వర్లు విద్యార్థులను శాలువాతో సత్కరించారు.(హెచ్ ఈసి)లో స్టేట్ 4వ ర్యాంక్ సాధించిన ఆదిలక్ష్మీకి 5000వేల రూపాయ ప్రైజ్‌మని అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... భవిష్యత్తులో మరింత ఉన్నత స్థితిలో కళాశాల ఎదుగుదలకు ఎల్లవేళలా అండగా ఉంటారని నారాయణ రెడ్డి పేర్కొంటూ ఇంత చక్కటి ఫలితాలను అందించిన ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి,సదానందం గౌడ్, అధ్యాపక బృందానికి అభినందనలు తెలియజేశారు.

అనంతరం ఎమ్మెల్యే రూ5000,వేల రూపాయల ప్రైజ్ మనిని(హెచ్ ఇసి)ఆదిలక్ష్మి కి అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వెనయ్య రమకాంత్,లక్ష్మీ కాంత్ సాగర్,మహబూబ్ అలీ,మల్లేష్,భీమేష్,జుబేర్, రాజేష్, మల్లికార్జున్, బిల్ కీస్, ఫాతిమా, బాలరాజ్, శ్రీనివాస్, సంతోష్, బాలయ్య పాల్గొన్నారు.

### గ్రామీణ బ్యాంక్ సహకారంతో

# విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

**గద్వాల(నందిన్నె),జూన్26(నమస్తే ఉదయం):** ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ సౌజన్యంతో నందిన్నె జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు సైకిలను అందజేశారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్పిఎఫ్‌ల ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఆర్ పిఎఫ్ కన్వీనర్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... పూజారి తండా ,సుల్తాన్ పురం గ్రామం నుండి నందిని హై స్కూల్‌కి రావడానికి ఉదయం ఆరు కిలోమీటర్లు సాయంత్రం ఆరు కిలోమీటర్లు కాలినడకన ద్వారా బడికి రావడం ఇబ్బందిగా ఉంది పిల్లలు స్కూల్కు రాకుండా డ్రాప్ అవుతున్నారు.

పిల్లలకు చదువులు ఎక్కడ ఆటంకం కలగకుండాగా ఉండాలని గ్రామీణ బ్యాంక్ మేనేజర్లు దినేష్, రామాంజనేయులు సైకిళ్లను ఇప్పించారు. తమ పిల్లలకు సైకిల్ సైకిళ్లు ఇప్పించినందుకు పిల్లలు వారి తల్లిదండ్రులు ప్రత్యేక ధన్య



గ్రామీణ బ్యాంక్ సౌజన్యంతో విద్యార్థులకు సైకిల్ పంపిణీ, విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

వాదాలు తెలియజేశారు. ముఖ్య అతిథులు ఎం వి ఎఫ్ స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, ప్రధానోపాధ్యాయులు విజయ భాస్కర్, సీఆర్పీఎఫ్ కన్వీనర్ పాల వెంకటేశ్వర్ రెడ్డి, కో కన్వీనర్ వీరన్న ,సభ్యులు ఆంజనేయులు, నాగిరెడ్డి టీచర్స్ ఎం వి ఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ సాయికుమార్, మండల్ ఇంచార్జి కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి పనిచేసిన వారిని గుర్తించాలి

# నామినేటెడ్ పోస్టులు కల్పించాలి

### తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్...




**కూకట్‌పల్లి, జూన్ 26 (నమస్తే ఉదయం):** విద్యార్థి నేత తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ బుధవారం అఖిల భారత ఇంచార్జి కన్హయ్య కుమార్ జీ.జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి, జాతీయ కార్యాలయంలోని న్యూ ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్ మరియు ఎంఎల్ సీ వెంకట్ బల్మూరి తెలంగాణ ఆఫీస్ బేరర్లతో కలిశారు. తదుపరి చేయవలసిన కార్యకలాపాల గురించి చర్చించారు. గత 10 సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన వారిని గుర్తించాలని, పనిచేవారికి నామేటెడ్ పోస్టలలో వసతి కల్పించేలా తెలంగాణ ప్రభుత్వానికి సూచించేలాని వారిని అభ్యర్థించారు.

# ప్రజా పాలన హెల్ప్ డెస్క్‌లు ప్రారంభం

**రాజేంద్రనగర్, జూన్26(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ వార్డు కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన హెల్ప్ డెస్క్ ను సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాధా రాణి, వార్డు కార్యాలయం ఇంచార్జ్ పద్మావతితో కలిసి ప్రారంభించారు. నెలకు 200 యూనిట్ల లోపు




హెల్ప్ డెస్క్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్

కరెంట్ బిల్లు వచ్చేవారు వార్డు కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సబ్సిడీ గ్యాస్ గురించి కూడా హెల్ప్‌డెస్క్‌లో సమాచారం అందించడం జరుగుతుందన్నారు.

## ప్రైవేటు ఆసుపత్రులపై దాడులకు నిరసనగా

# ఆర్ఎంపీ వైద్యుల నిరసన

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 26(నమస్తే ఉదయం):** ప్రైవేటు ఆసుపత్రులపై దాడులకు నిరసనగా బుధవారం జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో మూడు రోజుల పాటు వైద్య సేవలు నిలిపివేశారు. వీరికి మద్దతుగా జోగులాంబ గద్వాల జిల్లా ఆర్ఎంపీ & పీఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు విజయ్ అధ్వర్యంలో నిరసన చేపట్టారు. జిల్లాలో ఉన్న ఆర్ఎంపీ పీఎంపీల తరుపున ఈ దాడులను ఖండిస్తున్నామని అధ్యక్షుడు



హాస్పిటల్‌పై దాడిని నిరసిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్ఎంపీ డాక్టర్లు

విజయ్ తెలిపారు.క్వాలిపై డాక్టర్‌కు మా మద్దతు ప్రకటిస్తూ 3 రోజుల పాటు తమ ప్రథమ చికిత్స కేంద్రాలు మూసివేయడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విశేశ్వర ఆచారి, సుధాకర్, ఇబ్రహీం, దరూర్ అంజి, నౌసద్,అమరావయి నర్సింహ, నరేష్, రాము, వెంకటేష్,శేఖర్ తదితర ఆర్ఎంపీ డాక్టర్ లు పాల్గొన్నారు.

## ప్రజలకు మంచినీటి సరఫరాలో ఉద్యోగులు మెరుగైన సేవలు అందించాలి: జీఎం సాయి లక్ష్మి

**రాజేంద్రనగర్, జూన్ 26(నమస్తే ఉదయం):** మంచినీటి సరఫరా లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని రాజేంద్రనగర్ జలమండలి డివిజన్



రాజేంద్రనగర్ జలమండలి జిఎం ఎస్ శ్రీలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు

జిఎం ఎస్ సాయి లక్ష్మి సూచించారు. బుధవారం నూతన జిఎం గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సాయి లక్ష్మిని ఉద్యోగులు కలిసి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాయి లక్ష్మి మాట్లాడుతూ... ఉద్యోగులు సమన్వయంతో పనిచేసే సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. నీటి సరఫరాతో పాటు సంస్థకు రావలసిన మంచినీటి బిల్లు వసూలు పై ఉద్యోగులు సిబ్బంది దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం జమీల్, ఉద్యోగ సంఘం నాయకుడు జావిద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువులలో పేరుకుపోయిన

# గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలి

### బస్తీలలో దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి...

### కాలనీలలో దోమల వ్యాప్తికి వాకింగ్ నిర్వహణ చేపట్టాలి..

**కూకట్‌పల్లి, జూన్ 26 (నమస్తే ఉదయం):** కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని కాముని చెరువు, మైసమ్మ చెరువు, ముల్లకత్వ చెరువుల్లో కలుషిత జలాల వల్ల పేరుకు పోయిన గుర్రపుడెక్కతో విపరీతమైన దోమలతో పగలు రాత్రి తేడా లేకుండ వాటి బారిన పడి రోగాల పాలవుతున్న చెరువుల చుట్టు పక్కల ఉన్న 2572 కుటుంబాలు దాదాపు 10 వేలపై చిలుకు జనాభా కలిగిన రెయిన్బో విస్టాస్ రాక్ గార్డెన్,



1290 కుటుంబాలు 4 వేల పైచిలుకు జనాభా, రెయిన్బో విస్టాస్ ఫేస్1 450 కుటుంబాలు దాదాపు 2 వేల జనాభా , చుట్టుపక్కల కాలనీలైన సేవాలాల్ నగర్, రాఘవేంద్రనగర్, కైత్లాపూర్, మైస్టిక్ హిల్స్, సప్దార్ నగర్, ఆంజనేయ నగర్, గాయత్రినగర్ కాలనీల దోమల సమస్య , కైత్లాపూర్, సేవాలాల్ నగర్ మధ్య ఉన్న ఇరుకైన రోడ్డు విస్తరణ కు నోచుకోక తద్వార నిత్యం విపరీతమైన ట్రాఫిక్ సమస్య కు పరిష్కారం చూపమని స్థానిక శాసనసభ్యులు మాధవరం కృష్ణరావును కలిసి వినతిపత్రం అందజేసిన రేయిన్బో విస్టాస్ అధ్యక్షులు బండి మధుసూదన రెడ్డి, రామిడి. ప్రమోద్ రెడ్డి, టి.రామ్ కిరణ్, పూసపాటి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు





# ఏబీవీపి ఆద్వర్యంలో విద్యా సంస్థల బంద్ విజయవంతం

**శంషాబాద్, జూన్ 26(నమస్తే ఉదయం):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని ఈరోజు ఏబీవిపి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్ కు పిలుపు ఇవ్వడం జరిగింది.దీనిలో భాగంగా బుధవారం శంషాబాద్ మండలంలో ఉన్న ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలను బంద్ చేయించారు.

ఈ కార్యక్రమంలో శంషాబాద్ జిల్లా కన్వీనర్ చాకలి మహేష్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కారు విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపెడుతూ విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు ప్రారంభం అయి పది నుంచి పదిహేను రోజులు పూర్తయిన ఇంత వరకూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించక పోవడం సిగ్గు చేటని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస, మౌళిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అని తెలిపారు.

ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల్లో లక్కలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తూ విద్యా వ్యాపారాలకు పాల్పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది అని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేట్ విద్యాసంస్థలకు తొత్తులుగా మారి పరో క్షంగా వారికి సహకరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌక ర్యాలు కల్పించకుండా, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ పేదలకు ఉచిత విద్య అందకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని, ప్రభుత్వ నిబంధనల కు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో బుక్స్, స్టేషనరీ, యూనిఫాం, షూస్ పేర్లతో చేస్తున్న వ్యాపారాన్ని అరికట్టాలి అని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస, మౌళిక సదుపాయాలు కల్పించాలని, మెగా డీఎస్సీ ద్వారా 25వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని,విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేదల కోసం 25 సీట్లు కేటాయించాలని, ఖాళీగా ఉన్న డీఈవో,ఎంఈవో పోస్టు భర్తీ చేయాలని,ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్,పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా కో కన్వీనర్ మణికంఠ, రాష్ట్ర కో కన్వీనర్ ప్రదీప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అఖిల్, పవన్, చరణ్, చందు, సురేష్, చరణ్, శివ, తిరుపతి, దినేష్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.






డ్రగ్స్‌కు దూరంగా ఉందాం అంటు నిర్వహించిన ర్యాలీకి జెండా ఊపి ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, అవగాహన సదస్సులో పాల్గొన్న ఎన్ సీ సీ, ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు

## మాదకద్రవ్యాలకు బానిసై

# తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు

**రాజేంద్రనగర్, జూన్26(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వెటర్నరీ కాలేజీలో ప్రపంచ డ్రగ్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన సదస్సును రాజేంద్రనగర్ పోలీసులు ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ జోన్ డీసీపీ సి.హెచ్ శ్రీనివాస్ పాల్గొనీ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యక్తిరేక అంశాలపై అన్ని విధాలుగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులంతా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రతిజ్ఞ చేయించారు.. అనంతరం 500 మందికు పై విద్యార్థు లందరూ కలిసి సే నో టూ డ్రగ్స్, సేవ్ లైఫ్ అని నినాదాలతో వెటర్నరీ కాలేజ్ నుంచి డైరీ ఫార్మ్ చౌరస్తా తిరిగి కాలేజ్ వరకు ఓ ర్యాలీ నిర్వహించారు.. కార్యక్రమంలో వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఉదయ్ కుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ విజయ్, రాజేంద్రనగర్ ఇన్స్‌పెక్టర్ బి. నాగేంద్ర బాబులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

# నిమ్జ్ ఏర్పాటులో నిరుద్యోగులకు ఉపాధి

### మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి

**సంగారెడ్డి,జూన్26(నమస్తే ఉదయం):** నిమ్జ్ అనేది ఒక అద్భుతమైన ఆలోచన అని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. నిమ్జ్ రావడంతో జహీరాబాద్ నియోజకవర్గ చుట్టుపక్కల కూడా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నిమ్జ్ వల్ల 3.లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ సుమారు 50 వేల కోట్ల వరకు కాస్ట్ పెరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చ బోతున్నామని చెప్పారు. రూ. 31 వేల కోట్ల రూపాయల రైతు రుణ మాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేయబోతున్నామని తెలిపారు. మల్లన్న సగర్ భునిర్వసుతుల కోసం. 123.ఉనీ. రద్దు చేయాలని ఆ సైన్డ్ భూములు పట్టా భూములకు సమానంగా నష్టపరిహారం చెల్లించాలని పోరాటం చేశామని ఈ మేరకు తగిన న్యాయం చేస్తామని చెప్పారు.



సీఎం యువకుల కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లు తీసుకొస్తున్నారని వాటి వల్ల యువతలో ఎంతో నైపుణ్యత పెరుగుతుందని చెప్పారు.


**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.